# మొగ్గ

**నేను మూడు భాగాలుగా విడిపోయి ఉన్నాను.**
**రెండు ఒకదానితో ఒకటి వాదించుకుంటున్నాయి.**

మూడోది నిష్పక్షపాతంగా వింటోంది. మధ్యమధ్య ఇద్దరినీ ప్రశ్నిస్తోంది. నా మనస్సు ఓ న్యాయస్థానంలా ఉంది. నిద్ర రావడం లేదు. పక్కమీదికి చేరి గంటయినా, కునుకు పట్టడం లేదు. పొద్దున్నే లేచి యథాప్రకారం ఇంటి పనులు పూర్తి చేసుకుని ఆఫీసుకు వెళ్ళాలి.

ఆయన అటువైపుకి తిరిగి పడుకున్నారు. ఆయనొక నిశ్చితాభిప్రాయానికొచ్చేశారు. తన నిర్ణయం చెప్పేశారు ఖచ్చితంగా. ఇంక వాదనలకూ నచ్చజెప్పడాలకీ తావు లేదన్నట్లుగా. ఆయన మాటంటే మాటే. తన మాటే నెగ్గాలనుకుంటారు. తను అనుకున్నదే, తను అన్నదే సరియైనదంటారు. అందరూ తన మాట ప్రకారమే నడుచుకోవాలను కుంటారు. ఆయన ఇంటికి యజమాని. నాకు భర్త, వాడికి తండ్రి. భర్త పక్షం వహించాలా కొడుకు పక్షం వహించాలా అని నిర్ణయించుకోవడం అయిదేళ్ళకోసారి ఎవరికో ఒకరికి ఓటు వెయ్యడం అంత సులభం కాదు కదా. ఏ రాయి అయితేనేం పళ్ళూడకొట్టుకోవడానికి అనుకుని ఏదో ఓ పార్టీకి ఓటు పడెయ్యొచ్చు. ఇది అలాంటి సందర్భం కాదు.

మా సుపుత్రుడు ఆ పిల్లని తప్ప ఇంకెవర్నీ చేసుకోనని మొండికేశాడు. ఆ పిల్ల పేరు కమల్‌జిత్‌కౌర్. వాడితో పాటే పని చేస్తోంది అదే కంప్యూటర్ కంపెనీలో. ఆ మాట విన్నప్పటినుంచీ ఈయన మండిపడుతున్నారు. "వాడు ఇష్టపడి చేసుకుంటానన్నాడు. మరీ పసివాడేం కాదు దబాయించి కట్టడి చెయ్యడానికి. చదువయి పోయింది. ఉద్యోగం చేసుకుంటున్నాడు. వాడి బాధ్యత వాడు తీసుకుంటున్నప్పుడు మనమెందుకు అడ్డ పడటం, సరే అనేసి మన మర్యాద మనం దక్కించుకోవడం మంచిది కదా" అన్నాను. నా మీద కస్సుమంటూ లేచారు. "వాడికి లేకపోతే నీకన్నా బుద్ధండక్కర్లే? ఇది పెళ్ళనుకున్నావా? బర్త్‌డే పార్టీ అనుకున్నావా? సరే అనెయ్యడానికి!" అన్నారు.

"బర్త్‌డే పార్టీలో కలవగా లేనిది పెళ్ళికి కలిస్తే మాత్రం ఏం పోయింది?" అని అనే ధైర్యం లేక, "ఈ రోజుల్లో ఆ తేడాలు ఉండకూడదనీ, అందరం సమానం అనీ అంటున్నాం కదండీ" అన్నాను.

"ఓహో! ఇంకనేం? మీ తల్లీకొడుకూ - ఇద్దరూ పోయి ఆ గురుద్వారాలో చేరండి" అంటూ కంచం ముందు నుంచి లేచిపోయి వాష్‌బేసిన్‌లో చెయ్యి కడిగేసుకున్నారు. ఈయన వరస చూస్తే ఇదీ!

వాడిమటుకు వాడు - తన పెళ్ళికి రావడానికి మేము ఒప్పుకునేదాకా ఈ ఇంట్లో తిండి తిననని మొరాయించి సెలవయిపోయిందంటూ రైలుకి వెళ్ళిపోయాడు. వాడున్న మూడు రోజులూ తండ్రీ కొడుకులు ఎదురుపడి మాట్లాడుకోలేదు. తండ్రిని ఒప్పించే బాధ్యత నాదేనని చెప్పేసి వెళ్ళిపోయాడు వాడు. ఇద్దరికీ మధ్య నేను నలిగిపోతున్నాను.

వారం రోజుల నుంచీ రాత్రిళ్ళు నిద్రపట్టక సతమతమవుతున్నాను. పైన ఎముకలు కొరికే చలి. లోపల రగులుతున్న సంఘర్షణ.

పొద్దున్నే వరండాలో పడుతున్న చిరు ఎండలో కూచుని ఆయన పేపరు చూస్తూంటే కాఫీ పట్టుకెళ్ళి ఇచ్చి పక్కనున్న కుర్చీలో కూచున్నాను. కాఫీ కప్పుని పక్కనున్న టీపాయ్‌మీద పెట్టి పేపరు మొహానికడ్డం పెట్టుకున్నారు. అయినా నేను వదిలిపెట్టకుండా "ఏమండీ, వాడికి ఫోన్‌లో ఏం చెప్పమంటారు?' అన్నాను.

"వాడి ఏడుపు వాణ్ణి ఏడవమని చెప్పు" అన్నారు పేపరు రెపరెపలాడేట్టు పేజీలు తిప్పుతూ.

"మనం వెళ్ళకపోతే ఏం బావుంటుందండీ. ఫోన్ చేసి సరోజకి కూడా ఏ సంగతీ చెప్పాలి కదా. తమ్ముడి పెళ్ళికి రావాలని దానికి మాత్రం ఉండదా?" అన్నాను.

"ఇదేమీ సంప్రదాయం ప్రకారం జరిగే పెళ్ళి కాదు. నువ్వెళ్ళకపోతే నష్టం లేదని చెప్పు నీ కూతురితో" అన్నారు నా మొహం కేసి చూడకుండానే - అక్కడికి సరోజ ఆయన కూతురు కానట్టు.

"ఇవాళ కాకపోతే రేపైనా వాడు మన దగ్గరికీ, మనం వాడి దగ్గరికీ వెళ్లక తప్పదు కదండీ. ఇంతదాకా వచ్చాక ఇంక మనం చెయ్యగలిగిందేముంది? వెళ్ళి నాలుగక్షింతలు వేసొస్తే మర్యాదగా ఉంటుంది కదా" అన్నాను మెల్లిగా.

"ఆ సంకర వివాహానికి అక్షింతలొక్కటే తక్కువ! వెళ్ళు. నువ్వు కూడా వెళ్ళి నలుగురి చేతా అక్షింతలు వేయించుకో!" అన్నారు. నిజానికి నాకేం పెద్ద బాధగా లేదు వాడు ఓ సర్దారిణీని చేసుకుంటున్నందుకు. ఓసారి ఎప్పుడో ఆ పిల్లని ఈ ఊరికి ఏదో ప్రాజెక్టు పని

మీద వచ్చినప్పుడు ఇంకో ఇద్దరు కొలీగ్స్‌తో కలిసి ఇంటికి తీసుకొచ్చినట్లు గుర్తు. ఆ మాట పట్టుకున్నారు ఈయన. "అదుగో! నువ్వూ వాడు మొదటి నుంచీ ఏకమయే ఉన్నారు. వాడి వ్యవహారమంతా నీకు తెలుసు. నాకు తెలియనివ్వకుండా ఇంత వ్యవహారం నడిపారు. నా మీద గౌరవం లేదు. నేనంటే విశ్వాసం అంతకన్నా లేదు మీ ఇద్దరికీ.." అంటూ ఛెడామడా దులిపేశారు. క్రమశిక్షణ పేరుతో వాణ్ని ఆయన తనకి దూరం చేసుకుంటే తప్పు నాదా? ప్రతిదానికీ నన్నడుగుతాడు వాడు. తండ్రిని అడగమంటే అడగడు. వాడి ప్రతి అభ్యర్థనకీ నా మద్దతు కావాలి. అలాగని ఎప్పుడైనా నా మాట నిలబెడతాడా? లేదు. వాడి స్వేచ్ఛని వాడు సదా వినియోగించుకుంటాడు.

నాకు అభ్యుదయభావాలున్నా, వాటిని ఆచరణలో పెట్టే అవకాశం లేదు. చిన్నప్పుడూ అంతే, ఇప్పుడూ అంతే. నా కోరికల్ని సాధించడానికి కావాల్సిన స్వేచ్ఛని త్యాగం చేసి. జీవితంలో వీలైనంతవరకు సంఘర్షణ లేకుండా చేసుకోవడంలోనే మానసిక శాంతి లభిస్తుందని అనుభవపూర్వకంగా తెలుస్తోంది. కోరికల సాధనకు స్వేచ్ఛ ఉండటం ముఖ్యమా, సంఘర్షణ నుంచి స్వేచ్ఛ లభించడం ముఖ్యమా అనేది తెలుసుకోవడం అనుభవం నేర్పింది. నిత్య సంఘర్షణ. నిత్య అవగాహన - ఇదే జీవిత విధానం అయిపోయింది.

నేనింకా తర్జనభర్జనలు పడుతుండగానే, వాడి దగ్గర్నుంచి రిజిస్టర్ పోస్ట్ వచ్చింది. వణుకుతున్న చేతుల్తో విప్పి చూశాను. పెళ్లి శుభలేఖ కార్డులు. అవి మామూలు శుభలేఖల్లా లేవు. దాదాపు రెండంగుళాల పొడుగూ, నాలుగంగుళాల వెడల్పూ ఉన్న కార్డుల మీద రెండు వరసల్లో నాలుగు ముక్కలేవో రాసి ఉన్నాయి. కళ్ళు మసకలు కమ్మినట్లయితే, కళ్ళద్దాలు తీసి కొంగుతో తుడిచి మళ్ళీ పెట్టుకుని చదివాను- "మేమిద్దరం పెళ్ళి చేసుకుంటున్న సందర్భంగా మీరు వచ్చి మా ఆనందంలో పాలు పంచుకోవలసిందని మా కోరిక" అని ఉంది- ఇంగ్లీషులోనే. సమయం, స్థలం, తేదీ వగైరాలు ఉన్నాయి. అడుగున వాడి పేరూ, పిల్లపేరూ ఉంది. ఓ పాతిక కార్డులున్నాయి. వాటితోపాటు ఓ చిన్నచీటీ కూడా ఉంది. అందులో రెండు ముక్కలు రాశాడు - "మీ ఇద్దరూ వస్తే సంతోషిస్తాను. మీకు కావల్సిన వాళ్లకెవరికైనా ఆహ్వానం కార్డులు పంపించండి" అని. కార్డులో మా పేర్లెక్కడా లేవు. మేము పంపించుకోవాలిట. "ఔరా! ఎంతటి సమర్థుడవైపోయావురా!" అనుకున్నాను ఆశ్చర్యంతోనూ, ఆవేదనతోనూ.

పోనీ, కక్కుర్తి పడి పంపిద్దామన్నా ఆ పాతిక కార్డులూ, ఏ మూలకి? రమ్మని పిలిచినా పిలవకపోయినా, కనీసం తెలియబరచడానికైనా రెండు వందలు పైగా ఉన్నారే! ఇటువైపు వాళ్ళూ, అటువైపు వాళ్ళూ బంధువులే ఉంటారు పాతికమంది. మమ్మల్నే "వస్తే రండి. లేకపోతే లేదు" అన్నట్లుగా పిలిస్తే, ఇక వాళ్ళందర్నీ ఏం తలుచుకుంటాడు వాడు!

ఏమైనా, వ్యవహారం శ్రుతిమించిపోయింది. నా ధైర్యం విలోలంబైంది. ఇంతవరకూ మనసులో కించపడుతున్నా, వాడి పక్షం వహించి వాడి స్వేచ్ఛని సమర్థిస్తూనే వచ్చాను. ఇక ఇప్పుడు వీడు ఆఖరి అస్త్రం ప్రయోగించేశాడు. ఆయన్ని ఎలా ఒప్పించడం? ఉన్న ఒక్క కొడుకు పెళ్ళికి వెళ్ళకుండా ఉండాలంటే మనసొప్పడం లేదు. మళ్ళీ మళ్ళీ వచ్చే అవకాశం కాదు కదా ఇది. ఏదో, వాడు తెలివితక్కువగా ప్రవర్తించాడని మేం కూడా అదే పని చేస్తే ఏమిటి మా పెద్దరికం? ఆయన ఒప్పుకుంటే బావుండును. నేను ఆఖరిసారిగా అర్థిద్దామని నిశ్చయించుకున్నాను.

ఆయన డాక్టరు దగ్గరికి వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. బి. పి. చెక్ చేయించుకొస్తానని వెళ్ళారు. ఈ మధ్య సహజంగానే బి. పి ఎక్కువగా ఉంటోందాయనకి. అలవాటుగా మందులు వేసుకుంటున్నా తగ్గడం లేదు. ఇవ్వాళ తల కూడా దిమ్ముగా ఉందని పడుకున్నారు పొద్దుటినుంచీ. నేను కూడా ఆఫీసుకు వెళ్ళ లేదు మనసు బావుండక.

పైగా, డిసెంబరు నెలలో ఉపయోగించుకోగలిగిన సెలవులు ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి.

డాక్టర్ని పిలవనా అంటే అక్కర్లేదన్నారు. నాలుగ్గంటలకి లేచి స్వయంగా బయలుదేరారు. నేను కూడా వస్తానన్నాను. వద్దు పొమ్మన్నారు. ఇప్పుడు ఏమాట మాట్లాడినా నా మీద విసుక్కోవడం మామూలైపోయింది. ఆయన మనస్సు తెలిసి, నేనూ పట్టించుకోవడం లేదు.

నా తలకాయ కూడా రకరకాల ఆలోచనలతో బరువెక్కిపోతోంది. ఎవరితోనైనా చెప్పుకుంటే మనసు తేలికవుతుందనిపిస్తోంది. కానీ నా కుటుంబం గొడవలు నేనే నలుగురికీ చెప్పుకోవడం దేనికి? ఎలాగో ఆయన్ని ఒప్పించగలిగి ఈ గండం గడిస్తే చాలు - తరవాత సంగతి చూసుకోవచ్చు.

ఆయన తిరిగొచ్చి, సోఫాలో జార్లబడి కూచున్నారు. ముఖంలో వెళ్ళేముందున్నంత తీవ్రత లేదు.

"ఎలా ఉంది? కాఫీ తాగుతారా?" అన్నాను. ఏ కళనున్నారో, 'ఊ'! అన్నారు.

ఆయన కాస్త స్తిమితపడ్డాక శుభలేఖ గురించి చెప్పొచ్చులే అనుకున్నాను. కానీ, ఆయనే అడిగారు - "పోస్టులో ఏమైనా ఉత్తరాలు వచ్చాయా?" అని. ఇక దాచలేకపోయాను.

బిక్కుబిక్కుమంటూనే పేకెట్టు పట్టుకొచ్చి, ఉత్తరమూ, ఆహ్వానం కార్డూ తీసిచ్చాను. చదివి ఠక్కున చింపేసి, టీపాయ్ కింద ఉన్న చెత్తబుట్టలో పారేశారు. నా ప్రాణం చివుక్కుమంది. ఎంతైనా అది శుభలేఖ. అందులోనూ ఎవరో శత్రువుది కాదు - కన్న కొడుకుది. శత్రువుదైతే మాత్రం అలా చింపబుద్ధవుతుందా?

"మరీ అంత శత్రుత్వం సాధిస్తే ఎలాగండీ? ఎంతైనా వాడు మన కొడుకు కాకపోడు..?" అంటూ మొదలు పెట్టాను.

"నీకంత దురదగా వుంటే వెళ్ళి వాడి ఆనందాన్ని పంచుకో. నాకవసరంలేదు" అన్నారు. మొండితనం మానలేదు. బంధుమిత్రుల ఇళ్ళల్లో పెళ్ళిళ్ళవుతుంటే అప్పుడప్పుడు ఇద్దరంకలిసి వెళ్ళలేకపోతే ఎవరో ఒకరం వెళ్ళి రావట్లేదా! అలాగే ఇదీనూ! అనవసరంగా వెలితి పడడం ఎందుకు? అనుకుని -

"సరే అయితే నేనే వెడతాను మరి" అన్నాను.

"పోవే! పో! వెళ్ళిన దానివి మళ్ళీ రావక్కర్లేదు. అక్కడే నీ కొడుకు దగ్గరే ఉండిపో" అన్నారు సోఫాలోంచి విసురుగా లేస్తూ.

నేను నిర్ఘాంతపోయాను. కళ్ళలో నీరు చివ్వున ఉబికింది. ఎంత చులాగ్గా అనేశారు! ముప్పయ్యేళ్ళు కాపురం చేసినా మూడు సెకండ్లలో తెగతెంపులు చేసుకోగలిగినట్లు. ఆ బ్రహ్మాస్త్రానికి తిరుగులేదనే కదా ఆ బెదిరింపు. నేను తనతో సమానంగా చదువుకున్న దాన్ని. ఉద్యోగం చేస్తున్నదాన్ని అనే గౌరవం కించిత్తు చూపలేకపోయారు. కొడుకు దగ్గరికిపోతే వాడింతకన్న నిర్వాకం చేస్తాడని నమ్మకం ఏమిటి? వాడు మాత్రం మగవాడు కాడూ? 'ఈయన' కాకపోతే 'వాడు' అనుకోవాలా? వీళ్ళిద్దరి అండలో తప్ప నేను బతకలేనా? తలుచుకుంటే నిక్షేపంగా బతకగలను. నలుగురూ ఏమనుకుంటారో అన్న భయం నాకొక్కదానికేనా? వాళ్లకుండదా ఆ భయం? నిజమే. వాళ్లకుండదు. సమాజం ఆడదానిదే తప్పు అంటుందన్న ధైర్యం.

అయినా, ఆయనన్న మాటలకి బాధపడినా, కోపం రాలేదు నాకు. అర్భకుడి ఆక్రోశంలా అనిపించింది. చిన్నప్పుడు మా సుపుత్రుడు - అయిదేళ్ళు కూడా ఉన్నాయో లేదో - ఓసారి వాడికి కావాల్సింది పెట్టలేదనో, ఇవ్వలేదనో కోపం వచ్చి "నువ్వు అమ్మగా ఉండొద్దు, పో, అవతలికి" అన్నాడు. వాడి మాటలు పట్టుకుని వెళ్ళిపోయానా! "ఏడిశావ్ వెధవా?" అని పిర్రమీద ఒక్కటి వేసి "ఎక్కడ నేర్చుకున్నావ్ ఈ మాటలు" అన్నాను.

ఇప్పుడుకూడా ఆయన అన్నమాటలికి "మీ మొహం!" అనుకుని వెనక్కి వెళ్ళాను.

వీధిలోకి కాదు, వంటింటి వైపే వెళ్ళాను. భార్యలా, బానిసలా కాదు - ఆయన అవసరాలు తీర్చే తల్లిలా. నా కొడుక్కి ఇప్పుడు నా అవసరం లేదు. కాబోయే కోడలు చూసుకుంటుంది. ఈయనకి నేను తప్ప చూసే దిక్కెవరు?

*ఆకాశవాణి, హైదరాబాదు సౌజన్యంతో*
*సుప్రభాతం, 20 సెప్టెంబర్ '97*